సాక్షి జగిత్యాల

శనివారం । 8 । ఏప్రిల్ । 2023



ధర్మపురి కాషాయమయం

ధర్మపురి: కొండగట్టు అంజన్నను దర్శించుకున్న భక్తులు.. శుక్రవారం ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో పూజలు చేశారు.



పారిశుధ్య పనులు ముమ్మరం

ధర్మపురి : మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో గోదావరిలో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

రంజాన్ వేళలు

దైవం దృష్టిలో రాజు రైతు, ధనిక పేద, కులం మతం, జాతి, వర్గ బేధాలు లేవు.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని 6.34	ఆది 4.39

న్యూస్‌రీల్

వెంకన్నకు క్షీరాభిషేకం



పూజలు అందుకుంటున్న శ్రీవేంకటేశ్వరస్వామి

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని రంగురంగుల పూలతో చూడముచ్చటగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు శ్రీనివాసచార్యులు మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీహవన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇఫ్తార్ ఏర్పాట్లపై సమీక్ష



ముస్లింలతో సమీక్షిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి/గొల్లపల్లి : రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన ఇఫ్తార్‌పై నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ముస్లిం నాయకులతో మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం సమీక్షించారు. అదేవిధంగా జైన– దొంతాపూర్ మధ్య డబుల్ రోడ్డు నిర్మాణానికి అనుమతి లభించడం, సెంట్రటల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు, ఇందుకోసం రూ.30 కోట్లు మంజూరు కావడంపై సమీక్ష జరిపారు. మంత్రికి రెండు గ్రామాల నాయకులు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

జగిత్యాలటౌన్: జిల్లాలో శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని పలు చర్చీలు క్రైస్తవుల రాకతో కళకళలాడాయి. వారికోసం నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఏసు శిలువపై పలికిన ఏడు మాటలు ధ్వనించాయి. ప్రత్యేక భక్తి గీతాలు ఆలపిస్తూ క్రైస్తవులు చర్చీల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పాపులను రక్షించేందుకే యేసుక్రీస్తు శిలువపై ప్రాణత్యాగం చేశారని స్థానిక సీఎస్ఐ చర్చి ఫాదర్ ఏసురత్నం తన సందేశంలో పేర్కొన్నారు. హెబ్రోను, యేసురక్తం తదితర క్రైస్తవ మందిరాల్లో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఘనంగా భీమేశ్వరస్వామి జాతర ఉత్సవాలు



క్యూలైన్‌లో భక్తులు

జగిత్యాలరూరల్: పొరండ్ల శ్రీభీమేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి ఒడిబియ్యాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అలాగే హన్మాజీపేట గ్రామ శివారులోని శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు శుక్రవారం ఒడిబియ్యాలు సమర్పించారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి..

పొరండ్ల భీమేశ్వరస్వామి, హన్మాజీపేట పెద్దమ్మతల్లి జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట సర్పంచ్ పొగ్గల సంధ్యారాణి ఉన్నారు.

రికవరీ తంటాలు!



ఉపాధిహామీ పనుల్లో నిమగ్నమైన కూలీలు

- ఉపాధిహామీ పనుల్లో నిధుల దుర్వినియోగం
- పక్కదారి పట్టిన సొమ్ము సుమారు రూ.1.17కోట్లు
- రికవరీ చేసింది రూ.83.61లక్షలు
- మిగతా సొమ్ము స్వాధీనం ఎప్పుడు?

జిల్లా సమాచారం	
దుర్వినియోగమైన మొత్తం సొమ్ము(రూ.లలో)	1,17,93,697
రికవరీ చేసింది(రూ.లలో)	83,61,861
స్వాధీనం చేయాల్సింది (రూ.లలో)	34,31,836
నోటీసులు జారీచేసింది	3,892
మొత్తం ఉపాధి కూలీలు	1,50,000
మొత్తం జాబ్‌కార్డులు	1,08,924

జగిత్యాల: గ్రామాల్లో వలసలు నివారించాలనే లక్ష్యంతో చేపట్టిన ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2006లో ప్రారంభించింది. అయితే, పర్యవేక్షణ లోపంతో పథకం ద్వారా విడుదల చేసే నిధుల్లో చాలా దుర్వినియోగమవుతున్నాయి. సామాజిక తనిఖీల్లో అక్రమాలు బహిర్గతమవుతున్నాయి. అయితే, ఆ సొమ్మును రికవరీ చేయడంలో అధికారులు నానాతంటాలు పడుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు వివిధ పనుల్లో సుమారు రూ.1,17,93,697 దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ఇందులో రూ.83,61,861 వరకు రికవరీ చేశారు. మిగతా సొమ్మును అక్రమార్కుల నుంచి రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నా ప్రయోజనం లేకుండాపోతోంది.

3,892 మందికి నోటీసులు..

- జిల్లాలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడింది ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీలు ఉన్నట్లు గుర్తించారు.
- నిధులు దుర్వినియోగంలో భాగస్వాములైన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీలు కలిపి జిల్లాలో 3,892 మందికి అధికారులు నోటీసులు జారీచేశారు.

రికవరీ చేస్తున్నాం

జిల్లాలో పక్కదారి పట్టిన ఉపాధిహామీ నిధులు రికవరీ చేస్తున్నాం. ఇప్పటివరకు దాదాపు రూ.83,61,861 వరకు స్వాధీనం చేసుకున్నాం. దుర్వినియోగమైన ఈజీఎస్ నిధుల రికవరీలో రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచాం. మిగతా వారికి నోటీసులు జారీచేశాం. ఇందుకోసం ఆర్ఆర్ చట్టాన్ని వినియోగిస్తున్నాం.
– బి.చిన్నయ్య, డీఆర్డీవో విజిలెన్స్ అధికారి

- వివిధస్థాయిలో విచారణ చేపట్టి.. దుర్వినియోగమైన సొమ్ము నిందితుల నుంచి రాబడుతున్నారు.
- కూలీలకు ఏడాదిలో కనీసం 100 రోజుల పనిదినాలను కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుని. రూ.కోట్లు విడుదల చేస్తోంది.
- కానీ, కొందరు అక్రమార్కుల చేతివాటంతో ఆ సొమ్ము దుర్వినియోగమవుతోంది.

రూ.1,17,93,697 పక్కదారి..

జిల్లాలో ఇప్పటివరకు సామాజిక తనిఖీల్లో సుమారు రూ.1,17,93,697 పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. ఈ సొమ్మును రాబట్టేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దుర్వినియోగమైన డబ్బు రికవరీ చేసేందుకు రెవెన్యూ రికవరీ యాక్ట్(ఆర్ఆర్) చట్టాన్ని వినియోగించే వీలుందని అధికారులు చెబుతున్నారు. దీనికింద నిందితుల ఆస్తుల్ని జప్తు చేసే అవకాశం ఉంది. ఈక్రమంలో జిల్లాలోని మేడిపల్లి, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఆర్ఆర్ చట్టం వినియోగించి అక్రమార్కులకు నోటీసులు జారీచేశారు. దీంతో వారు భయాందోళనకు గురై వెంటనే దుర్వినియోగం చేసిన సొమ్ము తిరిగి చెల్లించారు. అయితే, ఈ చట్టాన్ని అక్రమార్కులు అందరికీ వర్తింపజేస్తే దుర్వినియోమైన మొత్తం సొమ్ము వసూలయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పటివరకు నిందితుల నుంచి సుమారు రూ.83,61,861 వరకు రికవరీ చేశారు.

ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతా



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీ బండి సంజయ్, కార్యకర్తలు

- కరీంనగర్ పోలీసుల తీరుపై మండిపడ్డ బండి సంజయ్
- కోర్టుకు సైతం ఈడుస్తానని ప్రతిన
- కర్మ జరుగుతున్న ఇంట్లో విధ్వంసం సృష్టించారని ఆక్రోశం
- సంజయ్ విడుదలతో బీజేపీలో ఉత్సాహం
- భారీ ఊరేగింపు, గజమాలలతో సత్కారం
- జైలు పరిసరాల్లో 144వ సెక్షన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ క్రైం/ కరీంనగర్‌టౌన్: ఇటీవల మరణించిన తన అత్తమ్మ కర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన తనతో దురుసుగా వ్యవహరించిన కరీంనగర్ పోలీసులను పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతానని ఎంపీ బండి సంజయ్ అన్నారు. పదో తరగతి పేపర్ లీకేజీ కుట్రలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో కరీంనగర్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఆయన శుక్రవారం ఉదయం బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం బండి పోలీసులు, ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన అత్తమ్మ మరణిస్తే.. తొమ్మిదవ రోజు (కర్మ) కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన తనను ఎలాంటి నోటీసులు లేకుండా అరెస్టు చేయడంపై మండిపడ్డారు. ఎలాంటి నోటీసులు, వారెంట్లు లేకుండా చట్టవిరుద్ధంగా కనీసం పార్లమెంటు సభ్యుడిని అనే గౌరవం లేకుండా దురుసుగా అరెస్టు చేశారని ఆరోపించారు. ఇంట్లో తన అత్తమ్మ కార్యక్రమం కోసం తెచ్చిన సామగ్రి, టెంట్లు చిందరవందర చేశారన్నారు. తనను గంటలకొద్దీ జీపుల్లో తిప్పి వరంగల్ పోలీసులకు అప్పగించినందుకు కరీంనగర్ పోలీసులను ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతానన్నారు. వీలుంటే కోర్టుకు కూడా ఈడుస్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కరీంనగర్‌లో హై అలర్ట్

- బండి సంజయ్ విడుదల నేపథ్యంలో.. కరీంనగర్ నగరంలో హై అలర్ట్ నెలకొంది. పదోతరగతి పేపర్ లీకేజీ కేసులో అరెస్టయిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ శుక్రవారం జైలు నుంచి ఉదయం 9.02 గంటలకు విడుదలయ్యారు.
- జైలు పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ అమలు చేయడంతో మీడియా మినహా కార్యకర్తలెవరినీ జైలువద్దకు అనుమతించలేదు. కేవలం నలుగురైదుగురు ముఖ్య నాయకులు మాత్రమే జైలు వద్దకు చేరుకున్నారు.
- బండి విడుదల సందర్భంగా జైలుకు దారి తీసే రోడ్లన్నీ పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన సంజయ్ మొదట మీడియాతో మాట్లాడారు. అనంతరం నేరుగా మహాలక్ష్మీ దేవాలయానికి చేరుకొని అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్కడి నుంచి సంజయ్ అత్తగారింటికి వెళ్లారు.
- ఇటీవల సంజయ్ అత్తమ్మ చిట్ల వనజ మృతిచెందగా ఆమె ఫొటోకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులతో కొద్దిసేపు మాట్లాడారు. సంజయ్ జైలు నుంచి విడుదలైన విషయం తెలుసుకొని జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు సంజయ్ వద్దకు చేరుకున్నారు.
- జ్యోతినగర్‌లోని సంజయ్ అత్తమ్మ ఇల్లు కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. అక్కడి నుంచి కార్యకర్తలతో కలిసి భారీ ఊరేగింపుగా కోర్టు చౌరస్తాకు చేరుకున్నారు. అప్పటికే సంజయ్ కోర్టు చౌరస్తాకు వస్తారనే విషయం తెలుసుకుని భారీగా కార్యకర్తలు చేరుకున్నారు.
- కార్యకర్తల కోలాహలం మధ్య అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడే క్రేన్ ఏర్పాటు చేసి సంజయ్‌ను భారీ గజమాలతో సత్కరించారు. కోర్టు చౌరస్తా నుంచి రేకుర్తి రాజశ్రీ గార్డెన్ వెళ్లే క్రమంలో భారీ ఊరేగింపుతో సంజయ్ ఎస్ఆర్ఆర్ కళాశాల వరకు పాదయాత్ర నిర్వహించారు.
- రేకుర్తి చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సైతం పూలమాల వేసి నివాళి అర్పించి, రాజశ్రీ గార్డెన్‌కు చేరుకొని కార్యకర్తలతో మాట్లాడారు. సాయంత్రం 3.30 గంటలకు బీజేపీ రాష్ట్ర ఇంచార్జి తరుణ్ చుగ్.. సంజయ్ అత్తమ్మ ఇంటికి చేరుకొని వనజ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అక్కడే 4 గంటలకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
- బండి సంజయ్ జైలు నుంచి ఇంటికి వచ్చిన అనంతరం బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్.. బండి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బండి సంజయ్ తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా 'మీరు బాధపడాల్సిన పనిలేదు, మీ కొడుకు వారియర్' అని అభివర్ణించారు.
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విడుదల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అడిషనల్ డీసీపీలు శ్రీనివాస్, చంద్రమోహన్, ఏసీపీలు తుల శ్రీనివాస్‌రావు, కరుణాకర్‌రావు, విజయ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు గట్టి బందోబస్తు నిర్వహించారు.
- మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎస్ ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, వాసుదేవారెడ్డి, బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, నాయకులు కటుకం లోకేశ్, పుల్లెల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణపై జంగ్ సైరన్

- ప్రధాని పర్యటన నేపథ్యంలో కోల్‌బెల్ట్ ప్రాంతంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా
- పార్టీ అధిష్టానం ఆదేశాలతో గోదావరిఖనిలో విస్తృత ఏర్పాట్లు
- కోల్‌బెల్టు నేతలకు ఫోన్‌లో దిశానిర్దేశం చేసిన సీఎం



సాక్షి, పెద్దపల్లి: ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో కోల్‌బెల్ట్ ప్రాంతంలో మహాధర్నాకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోంది. సింగరేణి బొగ్గుగనుల వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా కోల్‌బెల్టు ప్రాంతాల్లో 'మహా ధర్నాల'తో జంగ్ సైరన్ మోగించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బొగ్గు గనులకు నిలయమైన గోదావరిఖనిలో శనివారం సింగరేణి కార్మికులు, కార్మికసంఘాల నేతలు, మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, పార్టీ శ్రేణులతో మహాధర్నా నిర్వహించనున్నారు. జెడ్పీ చైర్మన్ పుట్టమధు భూపాలపల్లి జిల్లాలో నిర్వహించే మహాధర్నాలో పాల్గొననున్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ప్రజాక్షేత్రంలో బీజేపీకి గుణపాఠం చెప్పేలా మహాధర్నా విజయవంతం చేసేందుకు శ్రేణులు సమాయత్తం అవుతున్నాయి.

కోల్‌బెల్టు నేతలకు సీఎం ఫోన్..!

సింగరేణి సమస్య కేవలం ఆరు జిల్లాల సమస్య కాదని, తెలంగాణ ఆర్థిక ప్రగతిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే బొగ్గు గనుల వేలంకు కేంద్రం యత్నిస్తుందని ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్టానం పోరుబాటను ఎంచుకుంది. దీనిలో భాగంగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత గురువారం మహాధర్నాకు సంబంధించి కేటీఆర్ సింగరేణి పరిధిలోని పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో మాట్లాడగా, శనివారం నిర్వహించే నిరసన కార్యక్రమాలపై శుక్రవారం సీఎంవో కార్యాలయం నుంచి సీఎం కేసీఆర్ ఫోన్‌లో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. దీంతో గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కొరుకంటి చందర్ బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశమై మార్గనిర్దేశం చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గోదవరిఖని ప్రధాన చౌరస్తాలో నిర్వహించే మహాధర్నాకు కార్మికులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు



అంజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో చేపట్టిన హనుమాన్ చిన్నజయంతి వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఈనెల 4న వేడుకలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు నిర్వహించిన వేడుకలకు వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 2లక్షల మందికిగాపై దీక్షస్వాములు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చివరిరోజు స్వామివారిని అర్చకులు తమలపాకులతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ భాస్కర్ ఏర్పాట్లు, బందోబస్తు చర్యలు పర్యవేక్షించారు. అదనపు కలెక్టర్ మకరంద్ ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఏర్పాట్ల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధాన అర్చకుడు జితేంద్రప్రసాద్ స్వామి, ఉపప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి, ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, చైర్మన్ మారుతీస్వామి భక్తుల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మొత్తంగా హనుమాన్ జయంతి వేడుకలు పూర్తిప్రశాంత వాతావరణంలో జరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



కొమొరెడ్డి రామ్‌లుకు కన్నీటి వీడ్కోలు

మెట్‌పల్లి(కోరుట్ల): గుండెపోటుతో హఠాన్మరణం చెందిన కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు.

- మెయిన్‌లో ▸

'సాదా'.. సీదా ఎప్పుడు?

- రెండేళ్లుగా అర్జీదారుల ఎదురుచూపులు
- పరిష్కారానికి నోచుకోని దరఖాస్తులు
- జిల్లాలో 35 వేల మంది రైతుల అవస్థలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): తెల్లకాగితంపై రాసుకొని సాదాబైనామాతో కొనుగోలు చేసుకున్న భూములకు చట్టబద్ధత కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం 2016 సంవత్సరంలో తొలిసారి నిర్ణయం తీసుకుంది. అప్పట్లో దరఖాస్తులు స్వీకరించి ఉచితంగా పట్టా మార్పిడి చేసింది. భూములపై పూర్తిగా హక్కులు కల్పించింది. అయితే, అవగాహనలేక కొందరు రైతులు, సమాచారం తెలియక మరికొందరు అన్నదాతలు.. సాదాబైనామాలో దరఖాస్తు చేసుకోలేకపోయారని ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఈ క్రమంలో 2020 నవంబర్‌లో రెండోసారి సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. అయితే, అవి నేటికీ పరిష్కారం కావడంలేదు. దరఖాస్తుదారులు రెండేళ్లుగా నిరీక్షిస్తున్నారు. సాదాబైనామాల ఆధారంగా కొనుగోలు చేసిన భూమిని సాగు చేసుకుంటున్నా.. రైతుబంధు పథకం వర్తించడంలేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో 35,010 మంది రైతుల దరఖాస్తు..

- వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు చేసుకున్న రైతులు నమ్మకంతో తెల్లకాగితంపై నలుగురి సమక్షంలో ఒప్పంద పత్రాలు రాసుకున్నారు.
- కొన్నాళ్ల తర్వాత భూముల రేట్లు పెరగడంతో ప్రస్తుత ధర ప్రకారం డబ్బులు చెల్లించాలని ప్రస్తుతం ఇరువర్గాల మధ్య వివాదాలు జరుగుతున్నాయి.
- ఇలాంటి వాటికి పరిష్కారం చూపాలని రాష్ట్రప్రభుత్వం సాదాబైనామాలతో కొనుగోలు చేసిన భూములకు పట్టాలు జారీచేయాలని నిర్ణయం తీసుకుంది.
- ఈమేరకు రెండోసారి 2020 నవంబర్‌లో మరో అవకాశం కల్పించింది.
- దీంతో మీసేవా కేంద్రాల ద్వారా 35,010 మంది రైతులు తమ భూముల చట్టబద్ధత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.
- రెవెన్యూ అధికారులు వాటిని పరిశీలించి పట్టాలు జారీచేస్తారని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే, రెండేళ్లు గడిచినా దరఖాస్తులకు మోక్షం లభించడంలేదు.

ధరణిలో అవకాశం కల్పించాలి

భూముల లావాదేవీలను అధికారులు పూర్తిగా ధరణి పోర్టల్ ద్వారానే నిర్వహిస్తున్నారు. ఇందులో సాదాబైనామాల దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ప్రత్యేకంగా ఆప్షన్ ఇస్తేనే పరిష్కారం లభిస్తుందని రైతులు, అధికారులు పేర్కొంటున్నారు.

పట్టించుకుంటలేరు



సాదాబైనామాలో 12 గుంటల భూమి విషయంలో దరఖాస్తు పెట్టినం. అధికారులు చెప్పినట్లు కాగితాలు ఇచ్చినం. రెండేళ్లుగా నిరీక్షిస్తున్నం. మా సమస్యను వినేవారు లేరు. దరఖాస్తులు పరిశీలించినవారు లేరు. ఇట్లయితే మా సమస్యలు పరిష్కారం ఎప్పుడవుతయి?
– బద్దం మహిపాల్‌రెడ్డి, రైతు, భూషణరావుపేట

ఆదేశాలు పాటిస్తాం



ప్రభుత్వ సూచనల మేరకు అప్పట్లో రైతులు సాదాబైనామాలో దరఖాస్తులు చేశారు. వాటిని స్వీకరించాం. ప్రస్తుతం వాటిని తహసీల్దార్ కార్యాలయాల్లో భద్రపరిచాం. ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తాం. ఆ మేరకు సాదాబైనామాల విషయంలో తగిన చర్యలు తీసుకుంటాం.
– వినోద్‌కుమార్, ఆర్డీవో, కోరుట్ల

కొత్త చట్టంలో స్పష్టత ఏదీ?

సాదాబైనామాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరించి రెండేళ్లు గడిచింది. అయితే, దరఖాస్తులు పరిశీలించి రిజిస్ట్రేషన్ చేస్తారా? లేక కొత్త నిబంధనలు తెస్తారా? అనే విషయంపై రైతుల్లో అయోమయం నెలకొంది. పాత రెవెన్యూ చట్టం రద్దయ్యాక దాని ఆధారంగా చేపట్టే సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియ నిలిపివేయాలని కోర్టు అప్పట్లో ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ప్రభుత్వం క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేసింది. కొత్త రెవెన్యూ చట్టంలో సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం ఏవిధంగా చేస్తారనే అంశంపై స్పష్టత లేకపోవడంతో అధికారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. పాత పద్ధతి ప్రకారం తహసీల్దార్లకు మ్యుటేషన్ చేసే అధికారం ఉండేది. కొత్తగా సాదాబైనామా దరఖాస్తుల విషయంలో అధికారం ఎవరికి ఉంటుందనే మార్గదర్శకాలు జారీ కాకపోవడంతో రెవెన్యూ అధికారులు వాటిని పట్టించుకోవడంలేదు. దీంతో దరఖాస్తులన్నీ తహసీల్దార్ కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి.

క్లుప్తంగా

పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఏఎస్సైలు

జగిత్యాల క్రైం: పెద్ద కొడుకు, కోడలు వేధింపులకు గురిచేస్తున్నారని ఓ వృద్ధురాలు, పోలీసులను ఆశ్రయించింది. పట్టణ శివారులోని లింగంపేటకు చెందిన జవ్వాజి గంగుకు ఇద్దరు కుమారులు, కుమార్తె. భర్త కొన్ని రోజులక్రితం మృతిచెందగా దివ్యాంగుడైన చిన్న కుమారుడితో కలిసి పెద్ద కుమారుడి వద్ద ఉంటోంది. భార్య మాటలతో తల్లి, తమ్ముడిని వేధింపులకు గురిచేయడంతో పాటు కొట్టడంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఏఎస్సైలు వేణురావు, కరుణాకర్ ఆమె కుమారుడితో ఫోన్‌లో మాట్లాడారు. మళ్లీ ఇలా జరగకుండా చూసుకుంటానని పెద్ద కుమారుడు పోలీసులకు తెలిపాడు. అనంతరం ఇద్దరిని పోలీసులు ఆటోలో ఇంటికి పంపించారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన కల్లెడ లక్ష్మణ్(55) శుక్రవారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..లక్ష్మణ్ మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు కూతుళ్ల వివాహం కోసం సుమారు రూ.10 లక్షలు అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురై లక్ష్మణ్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై ఎండీ ఆలీమొద్దీన్ పరిశీలించారు. మృతుడి భార్య నర్సు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటీపీ చెప్పగానే రూ.1.90 లక్షలు మాయం

ధర్మపురి : సైబర్ మోసానికి ఓ వ్యక్తి రూ.1.90 లక్షలు పోగొట్టుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ధర్మపురికి చెందిన ఓ వ్యక్తికి సోషల్ మీడియాలో క్రెడిట్ పునరుద్ధరణకు ఓటీపీ చెప్పాలని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేయగానే క్రెడిట్‌కార్డు తిరిగి పునరుద్ధరణ అవుతుందని భావించి ఓటీపీ చెప్పేశాడు. వెంటనే అతని బ్యాంకు ఖాతాలోని రూ.1.90 లక్షలు మాయమయ్యాయి. దీంతో మోసపోయానని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కోటేశ్వర్ తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

డీఎస్పీ విచారణ

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందగా డీఎస్పీ విచారణ చేపట్టారు. అజ్మీరాతండాకు చెందిన భుక్యా కిషోర్ అనే యువకుడు వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి మృతిచెందాడు. డీఎస్పీ నాగేంద్రచారి మరిమడ్లలో శుక్రవారం విచారణ జరిపారు. సంఘటనా స్థలం వద్ద విద్యుత్ తీగలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వేటగాళ్లపై నిఘా ఉంచాలన్నారు. ఇక్కడ సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

ధీమా లేని బీమా పథకం

- నిలిచిన పశు బీమా పథకం
- పరిహారం అందక నష్టపోతున్న పాడిరైతులు
- పథకం అమలు చేయాలని అధికారులకు విన్నపం

జిల్లాలో పశువుల వివరాలు

తెల్లజాతి పశువులు	47,405
నల్లజాతి పశువులు	1,24,248
గొర్రెలు	6,10,985
మేకలు	97,033


ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసిన గొర్రెలు (ఫైల్)

పెగడపల్లి : ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు జిల్లావ్యాప్తంగా ఏటా వందలాది పశువులు మృతిచెందుతున్నాయి. పశు బీమా పథకం అమల్లో లేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతు బీమా, పంటల బీమాతో రైతులకు భరోసా కల్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశు బీమాను మాత్రం గాలికి వదిలేశాయని రైతులు వాపోతున్నారు. గతంలో కొన్నేళ్లపాటు అమలు చేసిన పశుబీమాను ప్రభుత్వం నిలిపివేసింది. పశువులు మృతిచెందితే పరిహారం అందక బాధిత రైతులు నష్టపోతున్నారు. రైతుల కోసం ఎన్నో పథకాలను చేపడుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పే మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. పాడి పశువులకు బీమా ఉంటే ఆయాసంస్థల నుంచి గతంలో పశువు రకాన్ని బట్టి రూ.50 వేల వరకు పరిహారం అందేది. జిల్లావ్యాప్తంగా లక్షల సంఖ్యలో పశువులతో పాటు గొర్రెలు, మేకలున్నాయి. వ్యవసాయంతో పాటు రైతులు పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకలను రాయితీపై అందిస్తున్నాయి. గొల్లకుర్మలకు రాయితీపై గొర్రెలను పంపిణీ చేసింది.

సబ్సిడీ గొర్రెలకు అంతే..

నాలుగేళ్ల క్రితం కొత్తగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకానికి ప్రభుత్వం మొదటిసారి బీమా సౌకర్యం కల్పించింది. కానీ ఏడాది తర్వాత బీమా ముగిసింది. రెన్యూవల్ చేయకపోవడంతో ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలకు ప్రస్తుతం బీమా లేకుండాపోయింది. ప్రస్తుతం రెండో విడుతలో అందిస్తున్న గొర్రెలకు ఏడాది పాటు బీమాను కల్పించింది. గేదెలు, ఆవులకు సైతం ప్రభుత్వం ఎప్పటిలాగే 50 శాతం నిధులు కేటాయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాడి పరిశ్రమతో జీవనాధారం..

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ జీవనాధారంగా మారింది. అన్ని గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల సంఘం ఉండటంతో పాలడెయిరీలు ఏర్పాటు చేసుకొని పాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా ఏటా వర్షాకాలంలో పిడుగుపాటుతో వందల సంఖ్యలో గొర్రెలు మేకలు, పశువులు మృతి చెందుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లోనూ పశువులు, జీవాల పెంపకందారులకు బీమా, ప్రభుత్వపరంగా పరిహారం అందక తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యుత్‌శాఖ నుంచి మాత్రం ఒకింత పరిహారం అంతుతోంది.

కొంతకాలం అందిన బీమా

2009 నుంచి 2018 వరకు పశువుల బీమా పథకం అమలు చేశారు. పాడిరైతులు కొంత సొమ్ము చెల్లిస్తే, ప్రభుత్వం కొంత బీమా చెల్లించేది. ప్రస్తుతం ప్రభుత్వం బీమాను నిలిపివేసింది. ఇప్పటికైనా పశువుల బీమాను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

అవకాశం కల్పించాలి



పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకలకు బీమా సౌకర్యం కల్పిస్తే మేలు జరుగుతుంది. వ్యాధుల బారినపడి, ఇతర కారణాల వల్ల పశువులు మృతిచెందితే రైతులకు నష్ట పరిహారం అందే అవకాశం ఉంది. ఇటీవల కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతిచెందాయి. సుమారు రూ.1.50 వేలు నష్టపోయాను. ప్రభుత్వం బీమా అమలు చేసి ఉంటే పరిహారం అందేది.
– కేశవేని చుక్కయ్య, గంభీర్‌పూర్

గొర్రెల బీమా పథకం అమలు చేయాలి



ప్రభుత్వం మొదటిసారి రాయితీపై అందించిన గొర్రెలపై ఏడాది బీమా కల్పించింది. గడువు ముగిసి రెండేళ్లయినా రెన్యూవల్ చేయడం లేదు. దీంతో గొర్రెలు మృతిచెందితే ఆర్థికంగా నష్టపోతున్నాం. గొర్రెల బీమా పథకం అమలు చేసి కాపరులను ఆదుకోవాలి.
– బైర రాజయ్య, పెగడపల్లి

ప్రభుత్వం బీమా నిలిపివేసింది



బీమా పథకాన్ని ప్రభుత్వం నిలిపివేయడంతోనే పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్లుగా ఈ పథకాన్ని నిలిపివేశారు. పశు బీమా అమలుచేస్తే ప్రమాదాల్లో పశువులు చనిపోయినా రైతులకు ఆర్థికసాయం అందుతుంది.
– గోపాల కృష్ణమూర్తి, జిల్లా పశువైద్యాధికారి

దేశానికే దళితబంధు ఆదర్శం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- రైస్‌మిల్లు, హోటళ్లు పరిశీలన


రైస్ మిల్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి(సిరిసిల్ల)/ఇల్లంతకుంట(మానకొండూర్): దళితబంధు దేశానికే ఆదర్శమని.. ఈ పథకం ద్వారా దళితులను రైస్‌మిల్లులకు, పెట్రోల్‌బంకులకు, హోటళ్లకు యజమానులు చేయడం నా కలలో కూడా ఊహించలేదని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో దళితబంధులో భాగంగా ఏర్పాటు చేసిన రైస్‌మిల్లు, పెట్రోల్‌బంక్, హోటళ్లను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ తరతరాలుగా వివక్ష, వెనుకబాటుకు గురైన దళితుల బతుకుల్లో అభివృద్ధి రేఖలు తీసుకురావాలని సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రతీ నియోజకవర్గంలో దళితబంధులో భాగంగా ఇలాంటి రైస్‌మిల్లు ఇండస్ట్రీని ఏర్పాటు చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు.

మిర్చీలు తిని.. అభినందించి

వీర్నపల్లి మండలం రంగంపేటలో దళితబంధులో భాగంగా ఏర్పాటు చేసుకున్న కుమ్మరి దేవయ్య హోటల్‌లో ఎమ్మెల్యే రసమయి మిర్చీలు తిని.. 'చాలా రుచికరంగా ఉన్నాయి..' అని అభినందించారు.

చర్చి నిర్మాణానికి భూమిపూజ

ఇల్లంతకుంటలోని ఎవాంజలికల్ చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ భూమిపూజ చేశారు. అనంతరం గుడ్‌ఫ్రైడే వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం చర్చి నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీలు పిల్లి రేణుక, వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు బండారి బాల్‌రెడ్డి, పిల్లి కిషన్, శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు ఎడ్ల లక్ష్మీరాజం, భాగ్యలక్ష్మి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు గజన్‌లాల్, హన్మండ్లు, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, పాస్టర్ మోజెస్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

- డీఎస్పీ నాగేంద్రచారి


హాజరైన ఆటో యజమానులు, డ్రైవర్లు

వేములవాడ : వేములవాడకు వచ్చే భక్తులు, స్థానికుల పట్ల ఆటో డ్రైవర్లు మర్యాదపూర్వకంగా మెదలాలని డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. స్థానిక మహాలింగేశ్వర గార్డెన్‌లో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నియంత్రణ పాటించాలని, మద్యంతాగి ఆటోలు నడపవద్దని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. ఓవర్‌లోడ్‌తో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో టౌన్ సీఐ వెంకటేశ్, ఎస్సైలు రఫీక్‌ఖాన్, దిలీప్, ఆటో యూనియన్ అధ్యక్షుడు దేవరాజు, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వారిపై కేసు

సిరిసిల్ల క్రైం : అదనపు కట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని ఓ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం గీతానగర్‌కు చెందిన మమతకు కరీంనగర్‌కు చెందిన కుర్ర కిషన్‌తో 2017లో వివాహమైంది. అదనపు కట్నం కోసం తన భర్త వేధింపులకు గురిచేస్తున్నాడని, మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త కిషన్‌తోపాటు అత్త రాజేశ్వరి, మామ కనుకయ్య, బావ కుర్ర వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

భర్త వేధిస్తున్నాడంటూ..

తాగుడుకు బానిసైన తనను భర్త వేధిస్తున్నాడంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శాంతినగర్‌కు చెందిన పద్మకు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన చెన్న శ్రీనివాస్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. భర్త నిత్యం తాగివచ్చి వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. మండలంలోని దుమాలలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సమస్యలను తమదృష్టికి తీసుకురావాలన్నారు. లూజువైర్లు, కొత్త స్తంభాల ఏర్పాటుపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ కదిరె రజిత, ఉపసర్పంచ్ హనుమంతు, బాలకిషన్, రాజిరెడ్డి, బాబు, దావిద్, రవీందర్ రెడ్డి, బాలమల్లు, రాజం, కొమరయ్య, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సైపై దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్

చందుర్తి (వేములవాడ) : కొండగట్టులో హనుమాన్ జయంతి సందర్భంగా బందోబస్తు విధుల్లో ఉన్న ఓ ఎస్సైతో కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించాడు. ఆ కానిస్టేబుల్ ఎవరనేది చందుర్తిలో శుక్రవారం చర్చనీయాంశమైంది. ఘాట్‌రోడ్డు వద్ద డ్యూటీలో ఉన్న ఎస్సై సివిల్ డ్రెస్‌లో ఉన్న కానిస్టేబుల్‌ను ఆపాడు. నేను కానిస్టేబుల్‌నని బదులివ్వగా ఎస్సై ఐడీ కార్డు చూపించాలన్నాడు. నేనేమైనా దొంగనా, లంగనా అన్న కానిస్టేబుల్ మాటలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆ కానిస్టేబుల్ ఎవరనేది తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయమై చందుర్తి సీఐ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఓ కానిస్టేబుల్ పేరు చెప్పారు.

మలేసియాలో జిల్లావాసి మృతి

వీర్నపల్లి: మండలంలోని సీతారాంనాయక్ తండాకు చెందిన భానోత్ బావ్‌సింగ్ (60) మలేషియాలో మృతిచెందాడు. బావుసింగ్ మూడేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం మలేషియాకు వెళ్లాడు. మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికాగా తోటి మిత్రులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం విధులకు వెళ్లకుండా గదిలోనే ఉన్నాడు. స్నేహితులు శుక్రవారం విధులకు వెళ్లొచ్చేసరికి గదిలో విగతజీవిగా పడి ఉన్నాడు. వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా గుండెపోటుతోనే బావుసింగ్ మృతిచెందినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని కుటుంబ సభ్యులు, సర్పంచ్ రవినాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

గుండెపోటుతో ఇద్దరు యువకుల మృతి

- క్రికెట్ ఆడుతూ ఒకరు.. వ్యవసాయ పనులు చేస్తూ మరొకరు


జీల సతీశ్(ఫైల్)


ఆంజనేయులు మృతదేహం

చిగురుమామిడి/గన్నేరువరం: కరీంనగర్ జిల్లాలో శుక్రవారం గుండెపోటుతో ఇద్దరు యువకులు మృతిచెందారు. క్రికెట్ ఆడుతూ ఒకరు, వ్యవసాయ పనులు చేస్తూ మరొకరు హఠాత్తుగా చనిపోవడం విషాదం నింపింది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన శనిగరం ఆంజనేయులు(37)గ్రామపరిధిలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీలో సమీప బంజేరుపల్లి టీం తరఫున క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. రెండు ఓవర్లు బౌలింగ్ చేశాడు. మూడో ఓవర్‌లో రెండు బాల్స్ వేసి కుప్పకూలిపోయాడు. తోటి క్రీడాకారులు ఫిట్స్ వచ్చిందనుకుని తాళం చేతుల గుత్తి చేతిలో పెట్టారు. నోటి నుంచి నురగలు రావడంతో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించేలోపే ఆంజనేయులు మృతి చెందినట్లు తెలిపారు. ఆంజనేయులు కట్టుమిషన్ కుడుతూ జీవనం సాగించేవాడు. ఇతడికి భార్య ధనలక్ష్మి, తల్లి మల్లవ్వ ఉన్నారు. కాగా, హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆంజనేయులు మృతదేహాన్ని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సందర్శించి నివాళి అర్పించారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా గన్నేరువరం మండలం సాంబయ్యపల్లె గ్రామానికి చెందిన జీల సతీశ్(32)తనకున్న పొలంలో వివిధ పంటలు సాగుచేస్తూ, ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం మొక్కజొన్న పంటకు నీళ్లు పారించేందుకు వెళ్తుండగా పొలానికి సమీపంలో గుండెపోటు రావడంతో కిందపడపోయాడు. అటుగా వెళ్తున్న రైతులు గమనించి స్థానిక వైద్యుడి వద్దకుతీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

- ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

ధర్మపురి : గ్రామగ్రామాన సీసీరోడ్లతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు మండలంలోని రామయ్యపల్లె గ్రామంలో పోచమ్మ గుడి వరకు ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో గ్రామాల్లో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, వైస్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, సర్పంచ్ మెడపట్ల దుబ్బయ్య, తదితరులున్నారు.

'భగీరథ' ట్యాంక్‌పై దీక్షాపరుల నిద్ర


భక్తుల రాసిన శ్రీ రామకోటి


బండపై నిద్రిస్తున్న హనుమాన్ భక్తులు

కొండగట్టు (చొప్పదండి) : హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా కొండగట్టుకు వచ్చిన హనుమాన్ భక్తులు బండలు, చెట్లు, ఆలయ వైజంక్షన్ ప్రాంతంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌పై నిద్రించారు.

అన్నదానం..

హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయ స్వామివారి ఆలయంపై రెండ్రోజుల పాటు భక్తులకు కరీంనగర్ టవర్ సర్కిల్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక సంస్థ ఆధ్వర్యంలో దాదాపు 40 వేల మంది స్వాములకు అన్నదానం చేశారు.

హుండీలపై రామకోటి పుస్తకాలు..

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హుండీలపై శుక్రవారం భక్తులు తాము రాసిన రెండు రామకోటి పుస్తకాలను పెట్టివెళ్లారు. ఆలయం మీద నిర్మించిన శ్రీ రామకోటి స్థూపం ప్రారంభమైతే ఆ స్థూపం వద్ద భక్తులు వారి పుస్తకాలను అప్పగించేవారు.

హనుమాన్ దీక్షాపరులకు రేడియం

మల్యాల: హనుమాన్ జయంతికి వచ్చే దీక్షాపరులు రాత్రివేళ ప్రమాదాల బారినపడకుండా వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు మల్యాల పోలీసులు.. దీక్షాపరులు కాలినడకన రోడ్డువెంట కొండగట్టుకు తరలివచ్చారు. రాజారం నుంచి కొండగట్టుకు కాలినడకన వచ్చిన దీక్షాపరులు రాత్రివేళ ప్రమాదాల బారినపడకుండా పోలీసులు రేడియం అతికించారు. దీంతో వాహనాల వెలుతురులో దీక్షాపరులను గుర్తించే అవకాశం ఉంటుందని, తద్వారా ప్రమాదాలు జరగకుండా తమవంతు చర్యలు చేపట్టామని ఎస్సై మంద చిరంజీవి తెలిపారు.

ఎల్లలు దాటిన ఒగ్గుకళ


ప్రదర్శనలో కళాకారులు

వేములవాడ రూరల్ : ఒగ్గు కళాకారుల నైపుణ్యం ఎల్లలు దాటింది. వేములవాడ మండలంలోని అచ్చన్నపల్లికి చెందిన గాజర్ల కొమురయ్య ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ సమైక్య సంయుక్త సహకారంతో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ సరిహద్దులోని ఝాన్సీ సమీపంలోని ఒర్ఛాలో కళాప్రదర్శనను నిర్వహిస్తున్నారు. రెండ్రోజులుగా జరిగే ఈ ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరవుతారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దు

- టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకులపై సీబీఐ విచారణ చేపట్టాలి
- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము


సిరిసిల్లలో వైఎస్సార్‌టీపీ కాగడాల ర్యాలీ

సిరిసిల్లటౌన్: లక్షలాది నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వాలు ఆడుకోవద్దని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము కోరారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకులపై శుక్రవారం రాత్రి సిరిసిల్లలో కాగడాల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పేపర్ల లీకుల అంశాన్ని తేలిగ్గా తీసుకోవద్దని, సీబీఐ విచారణ చేపట్టాలని కోరారు. ఎన్నికల హామీ నిరుద్యోగ భృతి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 1.90లక్షల మంది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అనుముల శ్రీకాంత్‌రెడ్డి, వంగరి అనిల్, మ్యాన లక్ష్మీనారాయణ, బిగుళ్ల హరీశ్, పూర్మాణి కరుణాకర్‌రెడ్డి, గజ్జల శ్రీధర్, కారంపురి రవి, గూడెల్లి రాజ్‌కుమార్, ఆకెన సత్తయ్య, చీకోటి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు


డీఈతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, బద్దిపోచమ్మ గుడి వద్ద బోనాల మంటపం, గుడిచెరువు సుందరీకరణ, వేద, నృత్య, సంగీత, సంస్కృత కళాశాలల పనులపై ఎమ్మెల్యే రమేశ్‌బాబు శుక్రవారం సమీక్షించారు. ఆలయ మాస్టర్‌ప్లాన్‌పై డీఈ రఘునందన్‌తో చర్చించారు. రూ.10 కోట్లతో బోనాల మంటపం, షాపింగ్‌కాంప్లెక్స్, రూ.12 కోట్లతో గుడిచెరువు సుందరీకరణ, రూ.90 లక్షలతో గుడిచెరువులో శివార్చన వేదిక, బద్దిపోచమ్మ గుడి ప్రాంతంలో సేకరించిన స్థలంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రూ.5కోట్లతో మినీ స్టేడియం పనులు పూర్తి చేయిస్తామన్నారు.